క్లుప్తంగా

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ సూర్యగిరి ఎల్లమ్మకు భక్తులకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలో క్యూలైన్‌లో ఉండి, మొక్కులు, కానుకలు చెల్లించుకున్నారు. అనంతరం సామూహిక సత్యానారాయణ వ్రతాలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

రావిర్యాలలో కంటివెలుగు శిబిరం



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ మౌనిక, చిత్రంలో కమిషనర్

తుక్కుగూడ: కంటి వెలుగు శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్ సూచించారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 5వవార్డు(రావిర్యాల)లో కంటి వెలుగు శిబిరాన్ని స్థానిక కౌన్సిలర్ మౌనికతో కలిసి ఆయన ప్రారంభించారు. వైద్య సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు, మాత్రలను పంపిణీ చేస్తారన్నారు. కౌన్సిలర్ మౌనిక, డాక్టర్ రాజుకుమార్, మున్సిపల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభకు పురస్కారం



ఎస్‌ఐ అజయ్‌కు రివార్డు అందజేస్తున్న ఏసీపీ

పహాడీషరీఫ్: తుక్కుగూడలోని సూరం చెరువులో వ్యక్తిని హత్య చేసి డ్రమ్ములో కుక్కి పడేసిన ఘటనలో నిందితులను గుర్తించడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన సెక్టార్ ఎస్‌ఐ అజయ్‌ను మహేశ్వరం ఏసీపీ అంజయ్య అభినందించి రివార్డు అందజేశారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసినప్పుడే బాధిత పక్షానికి న్యాయం జరుగుతుందని ఏసీపీ పేర్కొన్నారు. పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో 2009 బ్యాచ్‌కు చెందిన ఎస్‌ఐలు అజయ్, వెంకటయ్య, నయీముద్దీన్ త్వరలోనే ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతిపై వెళ్తుండటంపై ఏసీపీ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేయండి

మీర్‌పేట కమిషనర్ నాగేశ్వర్



మహిళా సంఘం సభ్యులతో సమావేశమైన కమిషనర్

మీర్‌పేట: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చేపట్టే సాంస్కృతిక కార్యక్రమాల్లో మహిళా గ్రూపు సభ్యులంతా పాల్గొని విజయవంతం చేయాలని మీర్‌పేట కార్పొరేషన్ కమిషనర్ నాగేశ్వర్ కోరారు. విద్యాశాఖ మంత్రి సబితా రెడ్డి ఆదేశాల మేరకు కార్పొరేషన్‌లోని మెప్మా ఆర్పీ (రిసోర్స్ పర్సన్స్)లతో మంగళవారం కమిషనర్ సమావేశమయ్యారు. ఈనెల 8వ తేదీన చెరువుల పండుగ సందర్భంగా చందన చెరువు, మంత్రాల చెరువుల వద్ద బతుకమ్మ, బోనాల ఊరేగింపు, రంగోళి పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని అన్నారు. మహిళా గ్రూపు సభ్యులందరూ పాల్గొనాలని సూచించారు. మేనేజర్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పాఠశాలలో దరఖాస్తుల ఆహ్వానం

హయత్‌నగర్: దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న హయత్‌నగర్‌లోని షేకీనా ఫౌండేషన్ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో చేరేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ చింతల ఇషాకర్ తెలిపారు. మానసిక వైకల్యం, ఆటిజం తదితర సమస్యలతో బాధపడుతున్న 5 నుంచి 18 ఏళ్ల లోపు బాలబాలికలు ఈ పాఠశాలలో చేరేందుకు అర్హులన్నారు. ఎంపికైన విద్యార్థులకు ప్రత్యేక విద్యతో పాటు స్పీచ్ థెరపీ, బిహేవియర్ మోడిఫికేషన్ థెరపీలో నిపుణులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఆసక్తి గలవారు డాక్టర్ సర్టిఫికెట్, ఆధార్, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హయత్‌నగర్ డిఫెన్స్ కాలనీలో షేకీనా ఫౌండేషన్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం. 9848156468కు కాల్ చేయాలన్నారు.

అభివృద్ధిలో అందరూ కలిసిరావాలి



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

కందుకూరు: కందుకూరు మండల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామని ఎంపీపీ మంద జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు జంగారెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కొత్తగూడలో సర్పంచ్ మల్లారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతి ఆధ్వర్యంలో జెడ్పీ నిధులు రూ.9 లక్షలు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3లక్షలతో భూగర్భడ్రైనేజ్ నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పాటు మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్

ఎంపీపీ జ్యోతి, జెడ్పీటీసీ జంగారెడ్డి

అనితారెడ్డి ప్రత్యేక చొరవతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. అభివృద్ధిలో అందరూ కలిసిరావాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ పద్మమ్మ, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాదయ్య, కోఆప్షన్ సభ్యుడు బాల్‌రెడ్డి, వార్డుసభ్యులు హన్మంత్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, మహేందర్, చెన్నకృష్ణ, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, పాండు, దీక్షిత్ రెడ్డి, కార్తీక్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరం..

అంతకుముందు కొత్తగూడలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ మల్లారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతి ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అవసరమైనవారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ రవీందర్, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

మహేశ్వరం: మహేశ్వరంలో జరిగిన వాలీబాల్ ప్రీమియర్ లీగ్(వీపీఎల్) సీజన్-1 పోటీలు సోమవారం ముగిశాయి. మూడు రోజుల పాటు నిర్వహించిన పోటీల్లో మొత్తం 6 జట్లు పోటీపడగా తుదిపోరులో గంగాభవానీ వాటర్‌ప్లాంట్-సాయి బాలాజీ బేకరీ జట్లు తలపడ్డాయి. ఇందులో సాయి బాలాజీ బేకరీ జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు రూ.30వేల నగదును మునగపాటి నవీన్ అందజేయగా, రన్నరప్ జట్టుకు రూ.20వేలను జోరాల రమేశ్ అందజేశారు. 3వ స్థానంలో నిలిచిన జట్టుకు ఆర్.కే.బ్రదర్స్ రూ.10వేలను అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న తురుంఖాన్ సినీ నిర్మాతలు ఆసిఫ్‌జైన్ క్రీడాకారులకు మెమొంటోలను బహూకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రియాంక, ఎంపీటీసీలు సుదర్శన్‌యాదవ్, కోఆప్షన్ సభ్యులు ఆదిల్‌అలీ, మార్కెట్ కమిటీ వైస్



విజేత జట్టుకు ట్రోఫీ, చెక్కు అందజేస్తున్న నిర్వాహకులు

చైర్మన్ ఆనందం, యాదయ్య, కుమార్, వాలీబాల్ నిర్వాహకులు శ్రీశైలం, సిద్ధార్థ్, శ్రీశైలం, జ్ఞానేశ్వర్, నందుయాదవ్, శివకుమార్, భరత్, శివ, మహేష్, సాయి, హనుమంతు పాల్గొన్నారు.

కందుకూరు సీఐ బదిలీ

కందుకూరు: కందుకూరు సీఐ కృష్ణంరాజు బదిలీ అయ్యారు. ఆయనను ఘట్‌కేసర్ ట్రాఫిక్ పీఎస్‌కు బదిలీ చేసినట్లు రాచకొండ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ 2 సంవత్సరాల పదినెలల పాటు ఆయన సమర్థవంతంగా విధులు నిర్వర్తించారు. మండలంలోని అందరితో స్నేహపూర్వకంగా మెలుగుతూ శాంతిభద్రతలను పరిరక్షించడంలో మంచిపేరు తెచ్చుకున్నారు. కాగా ఆయన స్థానంలో మల్కాజిగిరి సీసీఎస్ నుంచి విష్ణువర్ధన్‌రెడ్డి ఇక్కడికి రానున్నారు.

ఎన్నికల నిర్వహణకు అడ్‌హక్ కమిటీ ఏర్పాటు

వనస్థలిపురం: వనస్థలిపురం నివాసుల సంక్షేమ సంఘం ఎన్నికల నిర్వహణ కోసం అడ్‌హక్ కమిటీని ఎన్నుకున్నారు. ప్రస్తుత కమిటీ కాలపరిమితి ముగియడంతో నూతన కమిటీని ఎన్నుకొనేందుకు అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 30 వరకు కాలనీవాసుల సభ్యత్వాన్ని పూర్తిచేసి ఎన్నికలు నిర్వహించనున్నారు. సభ్యత్వం తీసుకోదలచినవారు నం.9399396222, 9177608134 సంప్రదించాలని కమిటీ సభ్యులు కోరారు.

వైఎస్సార్‌టీపీతోనే రాజన్న రాజ్యం

నియోజకవర్గ ఇన్‌చార్జి అర్జున్‌రెడ్డి



వైఎస్సార్టీపీలో చేరిన గిరిజన నాయకులు

కడ్తాల్: అభివృద్ధి, సంక్షేమంతో కూడిన రాజన్న రాజ్యం రావాలంటే వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిలతోనే సాధ్యమని కల్వకుర్తి వైఎస్సార్ టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చీమర్ల అర్జున్‌రెడ్డి అన్నారు. మంగళవారం కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పుల్లేరుబోడ్‌తండాకు చెందిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకి చెందిన మహిళలు, యువకులు.. హనుమంతు, లక్ష్మణ్, నవీన్, హర్యా, మహేశ్, రమేశ్, కిరణ్, భీక్యా, రాజు, శ్రీను, లక్ష్మీ, కమ్లీ, స్వప్న, మంజుల, శారద, శాంతి తదితరులు అర్జున్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌టీపీలో చేరారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు నరేశ్‌గౌడ్, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మండల ఉపాధ్యక్షుడు రమేశ్‌నాయక్, శివ, సాయి, రాకేశ్‌రెడ్డి ఉన్నారు.

శృంగేరి శంకరమఠం వార్షికోత్సవం

దిల్‌సుఖ్‌నగర్: అల్కాపురిలోని శ్రీ శృంగేరి శంకరమఠం షోడశ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం రాత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీ శృంగేరి శంకరమఠం బ్రాంచ్ హెడ్‌కేవీ శ్రీనివాస్, విశ్వనాథ శోభనాద్రి, యడపల్లి సూర్యనారాయణరావు, గౌరీ భాస్కర్, ముదిగొండ శంకర్శ వర్మ, దేప భాస్కర్‌రెడ్డి, సూరి వ్యాస్‌కుమార్, శ్రీనివాస్ బంగారయ్య శర్మ, నరసింహమూర్తి, సుధాకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవాలి



రెజ్లర్లకు మద్దతుగా దీక్ష చేపట్టిన అనురాధ, నాయకులు

- జెడ్పీటీసీ అనురాధ
- మహిళా రెజ్లర్లకు మద్దతుగా బీఆర్‌ఎస్ దీక్ష

కడ్తాల్: మహిళా రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురిచేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ చరణ్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలని ఆమనగల్లు జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం మహిళా రెజ్లర్లకు మద్దతుగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఒక్కరోజు నిరాహరదీక్ష చేపట్టారు. ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ..బేటీ బచావో బేటీ పడావో అంటూ ప్రచారం కొనసాగించే బీజేపీ ప్రభుత్వం మహిళలపై వేధింపులకు పాల్పడిన ఎంపీపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎంపీపై వెంటనే ప్రధాని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా రెజ్లర్లకు బీఆర్‌ఎస్ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్‌రావు, మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, గ్రంథాలయ సంస్థ జిల్లా డైరెక్టర్ రాధమ్మ, నాయకులు జయమ్మ, కల్యాణి, సరిత, మల్లమ్మ, రామకృష్ణ, వెంకట్‌రెడ్డి, కుమార్, ఖలీల్, గణేశ్, యాదగిరి, ఆనంద్, రంజిత్, శేఖర్ ఉన్నారు.

బీజేపీకి అధికారం ఖాయం

పార్టీ జిల్లా అధికారి ప్రతినిధి వీరయ్య

కడ్తాల్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలో రావడం ఖాయమని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎ.వీరయ్య అన్నారు. ఆమనగల్లులో విజయ సంకల్ప సభను పురస్కరించుకుని మంగళవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అలాగే.. గోవిందాయిపల్లి తండా గేటు వద్ద పార్టీ జెండాను అవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. నియంత పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. దేశ సంక్షేమం, అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కేవలం బీజేపీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాన్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్‌లో బైక్ ర్యాలీ


యువత క్రీడల్లో రాణించాలి



బహుమతులు అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్, నాయకులు

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్: గెలుపోటములను సమానంగా స్వీకరించాలని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ క్రీడాకారులకు సూచించారు. మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో నిర్వహించిన ఎంపీఎల్ క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ మేరకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ హాజరై.. సొంతంగా క్రీడాకారులకు రూ.20 వేల విలువ గల క్రికెట్ కిట్ అందజేశారు. అనంతరం విజేతగా నిలిచిన ఎస్టార్ అరుణ్ జట్టుకు స్థానిక నాయకులు భాస్కర్‌నాయక్ సమకూర్చిన రూ.30 వేల నగదుతోపాటు ట్రోఫీని, రన్నరప్‌గా నిలచిన రక్షిత్ కమాండర్ జట్టుకు.. స్థానిక సర్పంచ్ తులసీరాంనాయక్ సమకూర్చిన రూ.21వేల నగదుతో పాటు ట్రోఫీని ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తులసీరాంనాయక్, భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్, హీరాసింగ్, స్టాలిన్ కిషన్, లచ్యా, రవి, తులసీరాం, రవి, దాస్లా, మురళి, చందు చందన్, విక్రమ్, సీతారాం, అనిల్, రాజశేఖర్, సుధీర్, వినోద్ తదితరులు ఉన్నారు.



విద్యుత్ దీపాల వెలుగులో మీర్‌పేటలోని పురాతన బురుజు



చందన చెరువు వద్ద ఏర్పాటు చేసిన లైటింగ్

సంబురానికి ముస్తాబు

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని చెరువుల వద్ద విద్యుత్‌దీపాలతో అలంకరించారు. అదే విధంగా మీర్‌పేట గ్రామంలోని పురాతన బురుజుకు, కార్పొరేషన్ కార్యాలయానికి విద్యుత్ దీపాలు అమర్చారు. – మీర్‌పేట

బీజేపీ గెలిస్తేనే అన్ని వర్గాలకు న్యాయం

అందెల శ్రీరాములు యాదవ్



కాలనీవాసులతో మాట్లాడుతున్న అందెల శ్రీరాములు యాదవ్

బడంగ్‌పేట్: మహేశ్వరం నియోజకవర్గాన్ని మంత్రి సబితారెడ్డి కబంధ హస్తాల నుంచి విముక్తి చేసిన రోజే స్థానికులకు కొలువులు, కాలనీవాసుల గోసలు, పల్లెవాసుల తిప్పలు తీరుతాయని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ ధ్వజమెత్తారు. మంగళవారం బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని గుర్రంగూడలో పలు కాలనీవాసులతో కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి రాగానే మౌలిక వసతులకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని అన్నారు. ఒక్క అవకాశం బీజేపీకి ఇవ్వాలని కోరారు. జన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పథకాలను కాలనీవాసులకు వివరించారు. బీజేపీ గెలిస్తే అన్ని వర్గాలకు, అన్ని రంగాలకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు లక్ష్మారెడ్డి, శంకర్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

క్విజ్ పోటీలను విజయవంతం చేయాలి



క్విజ్ పోటీల గురించి అవగాహన కల్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని కళాశాలల విద్యార్థులకు రాజీవ్ గాంధీ యూత్ ఆన్ లైన్ క్విజ్ కాంపిటీషన్‌పై కాంగ్రెస్ నాయకులు అవగాహన కలిగించారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేప భాస్కర్ రెడ్డి సూచనల మేరకు ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వివిధ ప్రైవేట్ జూనియర్ కాలేజీలకు వెళ్లి రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తలాటి రమేష్ నేత, పెద్దవూర సైదులు, వంగాల శ్రీకాంత్ రెడ్డి, పగడాల శ్రీశైలం, శ్రీధర్, కల్యాణ్, శ్రావణ్, నగేష్, జిల్లా జగన్నాథం, మణిదీప్, సంతోష్, ప్రభు, విజయ్, మణికంఠ విప్లవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సుడిలో.. జీవీఆర్ కాలనీ

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ లేక అవస్థలు

- సీసీ రోడ్లు లేక వాహనదారుల ఇక్కట్లు
- వర్షం వస్తే కాలనీ అంతా జలమయం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారంలో గల జీవీఆర్ కాలనీలోలో సమస్యలు తిష్ట వేశాయి. కాలనీ ఏర్పడి పదిహేనేళ్ల గడుస్తున్నా కనీస సౌకర్యాలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తట్టిఅన్నారంలో జీవీఆర్ కాలనీ 2008లో ఏర్పడింది. అప్పటి నుంచి క్రమంగా ఇండ్ల నిర్మాణాలు పెరుగుతూ వస్తున్నాయి. ప్రస్తుతం ఈ కాలనీలో సుమారు 250 ఇళ్ల వరకు ఉన్నాయి. రోజురోజుకు జనాభా పెరుగుతున్నా సౌకర్యాలు కల్పించడంలో మున్సిపల్ అధికారులు విఫలం అవుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఔట్‌లెట్ లేక ఇబ్బందులు..

కాలనీలో కొంతమేర అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టినప్పటికీ మురుగు నీరు బయటికి వెళ్లే దారిలేకపోవడంతో కాలనీవాసులు డ్రైనేజీని వాడకుండా పైపులను మూసివేశారు. కొంత డ్రైనేజీరు కింది చెరువు వరద కాలువలోకి వెళ్తుంది. దీంతో వరద కాలువ మురికికాలువగా మారింది.

వర్షం వచ్చిందంటే..

కాలనీ చెరువుకు దిగువన లోతట్టు ప్రాంతంలో ఉండటంతో వర్షం వచ్చిందంటే కాలనీలోని ప్రధాన వీధులన్నీ జలమయం అవుతున్నాయి. వర్షాకాలంలో ఒక్కోసారి ఇళ్లలోనుంచి బయటికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడతుందని కాలనీవాసులు తెలిపారు. కాలనీలో ప్రధాన రహదారితో పాటు అంతర్గత రోడ్లు మట్టితో గుంతల మయంగా మారాయి. సీసీరోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీకి సక్రమంగా పన్నులు కడుతున్నా సౌకర్యాలు కల్పించడంలో అధికారులు వివక్ష చూపుతున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



ఔట్‌లెట్ లేక వరద కాలువలో కలుస్తున్న మురుగు



కాలనీ ప్రధాన రోడ్డు

సమస్యలు పరిష్కరించాలి



కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యేతో పాటు మున్సిపాలిటీ అధికారులను పలుమార్లు కలిసి వినతిపత్రాలు అందించాం. అయినప్పటికీ ఎలాంటి ఫలితం లేదు. కాలనీ అంతటా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలి. సమస్యలు పరిష్కరించాలి.

– రామ్మోహన్‌రావు, జీవీఆర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు